# ఏపి హజ్ బుల్లెటిన్

తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రచురితం

సంపుటి 3 సంచిక 3

**ఏప్రిల్ - 2019**

**రజబ్, హిజ్రీ 1440**



చీఫ్ ఎడిటర్,

**ఎస్.ఎం.డి.తాజుద్దీన్ ఆరీఫ్**

ఎడిటర్

**డా.ఫజులుల్లా ఖాన్**

**ఎడిటోరియల్ బోర్డు**

ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ

మౌలానా ముహమ్మద్ ఇల్యాస్

ముఫ్తి కె.ముహమ్మద్ రఫీ

**హజ్ కమిటీ సభ్యులు**

మోమిన్ అహ్మద్ హుస్సేన్ ఛైర్మన్

ముహమ్మద్ అహ్మద్ షరీఫ్ కౌన్సిల్ ఏపి

షేక్ మస్తాన్ షరీఫ్ జడ్పీటీసీ

టి.మహబూబ్‌సాబ్ ఎంపీపీ

షేక్ అక్బర్ సాహెబ్, వైఎస్.ఎంపిపీ

అబ్దుల్ చినరెహ్మాన్

హాజీ షేక్ హుసన్ బాషా

సయ్యద్ షా మఖ్దూమ్ బుఖారి



సంవత్సర చందా 85/-

విడిప్రతి వెల: **15/-**

ప్రచురణ

**ఏపి స్టేట్ హజ్ కమిటీ**

మసీదు వీధి, లబ్బీపేట్, విజయవాడ

టోల్‌ఫ్రీ నెం: 18004257873


బిస్మిల్లాహ్ హిర్రహ్మా నిర్రహీమ్

**అమిత దయాళువు, అనంత కరుణామయుడు అయిన అల్లాహ్ పేరుతో...**

**ఈ సంచికలో...**


| | |
|---|---|
| **పశ్చాతాపం చెందనిదే క్షమింపబడవు!** | **2** |
| **హజ్ 2వ రోజు** | **3** |
| **హిజ్రీ శకం-9లో జరిగిన హజ్** | **5** |
| **తెలుసుకోవాల్సిన అరబీ పదాలు** | **7** |
| **హజ్ ముఖ్య మైన దుఆలు** | **8** |
| **మేరాజ్ సందేశం** | **18** |
| **లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్** | **23** |


## ఏ.పి.హజ్‌బుల్లెటిన్ చదవాలనుకుంటున్నారా?

వెంటనే చందాదారులుగా చేరండి. హజ్-ఉమ్రా విధివిధానాలను ఖురాన్ హదీస్‌ల ఆధారంగా ఇస్లామిక్ స్కాలర్స్ ఆధ్వర్యంలో "ఏ.పి.హజ్‌బుల్లెటిన్"ను ఏపి హజ్ కమిటీ ప్రచురిస్తోంది. చందా వివరాలు విడి పత్రి రూ.15/- సంవత్సర చందా రూ.85/- (**డ్రా తేదీ నుంచి హజ్‌యాత్రకు వెళ్ళే వరకు**). చందా మొత్తాన్ని ఏపి స్టేట్ హజ్ కమిటీ, అకౌంట్ నెంబర్: 034310100141377 ఐఎఫ్ఎస్‌సి కోడ్: ఎఎన్‌డిబి0000343 ఆంధ్ర బ్యాంక్ లబ్బీపేట్ బ్రాంచ్, విజయవాడలో జమాచేయాలి.

## ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి వ్యాసాల్ని ఆహ్వానిస్తున్నాం

ప్రతి నెల విడుదలౌతున్న హజ్‌బుల్లెటిన్‌లో ప్రచురించడానికి ఇస్లామిక్ స్కాలర్స్ నుంచి హజ్, ఖురాన్, హదీస్‌కు సంబంధించిన ఆర్టికల్స్ (తెలుగు - ఉర్దూ భాషలో డిటిపి చేయించి ఓపెన్ ఫైల్ aphajjpro@gmail.comకు మెయిల్ చేయాలి). ప్రింట్ అవుట్ కానీ, రాత ప్రతిని కాని పంపరాదు.


**RNI No: TELBIL/2017/73690**

**Edited, Printed & Published by MD Tajuddin Aref, E.O. AP Haj Committee, 3rdFloor, # 39-3-2, Mosque Street, Labbipet, ViJayawada, AP. Printed at AP Haj Committee Vijayawada. Editor: Dr.Fazalullah Khan**

**EMail:aphajcommittee@gmail.com,Website:apstatehajcommittee.com**

**Postal No.VJ/197/2018/20**

# పశ్చాత్తాపం చెందనిదే క్షమింపబడవు!

హజ్ యాత్ర చేయాలనే మీ చిరకాల కోరిక... నెలలు, సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్న ఆ నిరీక్షణ గడియ రాబోతోంది. అల్లాహ్ కృపతో ఆయన మక్కా సందర్శించే అదృష్టం మీకు దక్కింది. హజ్ యాత్ర కంటే ముందు పవిత్ర రంజాన్ నెల. రంజాన్ నెలలో రోజా, నమాజ్, జకాత్ పూర్తి చేయండి. అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించండి. కరుగుతున్న కాలానికి కదులుతున్న సమయానికి తరిగే వయసుకి, మిగిలిపోయే జ్ఞాపకమే మంచితనం. గడిచిన జీవితాన్ని గుర్తుచేసుకొని పశ్చాత్తాపం చెందాల్సిన అవసరం ఎంతైనా వుంది. పశ్చాత్తాపం చెందనిదే క్షమింపబడవు. జీవితాన్ని ఒకసారి పరిశీలించుకునే సమయం వచ్చింది. అబద్ధాలాడడం, పరోక్షంగా నిందలు వేయడం, దౌర్జన్యం చేయడం, పరుల సొమ్మును కాజేయడం, దొంగతనం చేయడం, బంధువుల హక్కును నెరవేర్చకపోవడం, సంబంధాలను తెంచుకోవడం మొదలగు వాటిలో ఏదైనా దుర్గుణం ఉన్నా, దాన్ని తొలగించుకునే ప్రయత్నం చేయండి.

బహిరంగ శత్రువైన షైతాన్ బారి నుండి మానవజాతిని రక్షించడానికి కృపాకరుడైన విశ్వప్రభువు అనేక ప్రవక్తలను పంపాడు. ఆదమ్(అ) మొదలుగా, నూహ్, ఇబ్రాహీం, మూసా, ఈసా(అ)ల తర్వాత చిట్టచివరిగా ముహమ్మద్(స) వారిని పంపి ఇస్లాం మతంను పరిపూర్ణం చేయడం జరిగింది. ప్రవక్తలందరూ మానవులను రుజుమార్గం వైపు ఆహ్వానించారు. ప్రవక్తల పరంపర ముగిసినా మానవుల మార్గ నిర్దేశన కొరకు మన మధ్య ఖురాన్, ప్రవక్త(స) వారి సున్నత్‌లు ఉన్నాయి.

సకల జీవరాశుల్లో మనిషిని సర్వోన్నత జీవిగా అల్లాహ్ సృష్టించడమైనది. అంతే కాక మానవుడిని తన ప్రతినిధిగా నియమించాడు. ఈ ప్రతినిధిగా నియామకాన్ని దైవదూతలు ప్రశ్నిస్తూ ఈ మానవుడు కల్లోల జనకుడై అల్లకల్లోలం సృష్టిస్తాడేమోనని సందేహం వ్యక్త పరచగా, అల్లాహ్ వారికి మీకు తెలియనివి నాకు తెలుసని చెప్పాడు. ఆ తర్వాత అల్లాహ్ ఆదమ్(అ)కు సజ్దా చేయమని జిన్నాతులను, దైవదూతలను ఆజ్ఞాపించాడు. దైవదూతలు దైవాజ్ఞను శిరసా వహించగా ఇబ్లీసు తిరస్కరించాడు. జిన్నాతులను, దైవదూతలను ఆజ్ఞాపించాడు. దైవదూతలు దైవాజ్ఞను శిరసావహించగా ఇబ్లీసు తిరస్కరించాడు. జిన్నాతునైన నేను మానవునికి సజ్దా చేయవలసిన అవసరం లేదని ధిక్కరించాడు. దైవాగ్రహానికి గురై ఛీత్కరించబడ్డాడు. ఈ తర్వాత నేను ఏ మానవుని కారణాన ఛీత్కారానికి గురయ్యానో ఆ మానవ జాతిని సమూలంగా దైవధిక్కార జాతిగా మార్చి తీరుతానని సవాలు చేశాడు. మానవుడు భూమి పైకి వచ్చిన తర్వాత షైతాన్ తన పూర్తి శక్తితో మానవుడిని మార్గం తప్పించే ప్రయత్నం చేయసాగాడు. ప్రజలు అల్లాహ్ నుంచి మరలించి తనలా దౌర్భాగ్యునిగా చేయాలన్నది వాడి ఆకాంక్ష.

ఈ జీవన పయనంలో విజయంతో పాటు వైఫల్యాలూ ఉన్నాయి. ఆశా భంగాలూ ఉన్నాయి. కాని దారి తప్పిన ప్రతిసారి ప్రవక్తల జీవితాలు మనకు మార్గదర్శకం కావాలి. ఖుర్‌ఆన్ మనకు వెలుగు బాట. ఈ కార్యసిద్ధికై దీక్ష, దుఆలతో పాటు అల్లాహ్‌పై ప్రగాఢమైన విశ్వాసం ఉంచాలి. లక్ష్యం ఛేదించగలమనే సాహసంతో పాటు లోపాలను సరిదిద్దుకునే గుణం అలవడాలి. సజ్జనుల సాంగత్యం కోసం అలవాటుపడాలి. మనిషిలో అహం తగ్గిన రోజు ఆప్యాయత అంటే అర్థం అవుతుంది. గర్వం పోయిన రోజు ఎదుటివారిని ఎలా గౌరవించాలో తెలుస్తుంది. నేనే నాకేంటి అనుకుంటే చివరకు ఒక్కడిగానే ఉండాల్సి వస్తుంది. గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకుంటూ అందరితో కలిసి ఆనందంగా జీవించడమే మంచి జీవితం.

**ఎస్.ఎం.డి.తాజుద్దీన్ ఆరీఫ్**
చీఫ్ ఎడిటర్

# హజ్ 2వ రోజు

## అరఫాత్ వైపుకు ప్రయాణం

**తల్బియా : లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లా షరీక లక లకవల్ ముల్క్ లాషరీక లక**

-ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ

జిల్‌హజ్జహ్ మాసపు 9 వ తేదీన ఉదయం హజ్ యాత్రికులందరూ మినా నుంచి అరఫాత్ కు పయనిస్తారు. అరఫాత్ మినా నుంచి దాదాపు 16 కి.మీ. దూరంలో ఉంటుంది. ఒకవేళ మీరు ఎక్కువగా అలసిపోని పక్షంలో అరఫాత్‌కు సైతం కాలినడకనే వెళ్ళడం మంచిది. 4-5 గంటలు పడుతుంది. ఒకవేళ అంతగా నడిచే కారణంగా మీరు అలసిపోయి, ఆ అలసట కారణంగా అరఫాత్‌లో సరియైన రీతిలో ప్రార్థించలేని అవకాశమున్న పక్షంలో మీరు మౌల్లిం ఏర్పాటు చేసే వాహనం ద్వారా అరఫాత్‌కు చేరుకోండి.

అరఫాత్ రోజు జుహ్రకు సంబంధించిన ప్రారంభ వేళలో నిమ్‌రహ్ అనే మస్జిద్‌లో జుహ్ర్ మరియు అస్ర్ ఒకే సారి రెండు నమాజ్‌లు కలిపి చదువుతారు. అరఫాత్ రోజు కొరకు అస్ర్ నమాజును జుహ్ర్ నమాజ్‌తో కలిపి చదవవలసిందిగా (షరియత్‌లో) ఇస్లామీయ ధర్మశాస్త్రీయ ఆదేశమున్నది, తద్వారా సాయంత్రం వరకు దుఆ మొదలయినవాటి కొరకు పూర్తిగా తీరిక లభించేందుకు. మీరు ఆ జమాఅత్‌లో చేరే అవకాశముంటే రెండు నమాజ్‌లనూ జమాఅత్‌తో పాటే కలిసి చదువుకోండి. ఒకవేళ ఏదయినా కారణం చేత ఆ జమాఅత్‌లో మీరు చేరలేకపోయిన పక్షంలో మీరు జుహ్ర్ నమాజ్‌ను నిర్ణీత సమయంలో మరియు అస్ర్ నమాజ్‌ను నిర్ణీత సమయంలో చదువుకోండి.

అరఫాత్‌లో మిట్టమధ్యాహ్నం నుంచి సూర్యాస్తమయం వరకు గల సమయం ఎంతో విలువయినది. ఆ సమయంలో అల్లాహ్‌ను ఎంతగా హృదయపూర్వకంగా స్మరించగలిగితే అంతగా స్మరించండి, ఎంతగానయితే ఆయన ముందు రోదించగలరో రోదించండి, ఎంతగానయితే వేడుకోగలరో అంతగా వేడుకోండి ఈ విషయంలో ఎంతమాత్రం లోవభూయిష్ఠంగా వ్యవహరించకండి. అలాగే వీలయినంతవరకు నిలబడిన స్థితిలోనే ఆ విధంగా ప్రార్థించండి మరియు అల్లాహ్‌ను స్మరించండి.

అల్లాహ్‌ను స్మరించడానికి సంబంధించిన వచనాలలో క్రింద పేర్కొనబడిన వచనాన్ని ప్రత్యేకంగా అక్కడ అత్యధికంగా పఠించండి :

“ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్‌దు వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్ ”

తర్జుమా : “ అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయన కొరకే. ఆయన ప్రతి వస్తువుపై అధికారం గలవాడు”

దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “అరఫాత్ నాడు నా యొక్క మరియు నా కంటే పూర్వపు దైవప్రవక్తల యొక్క ప్రత్యేకమైన పిలుపు ఈ వచనమే ”

ఏదిఏమయినప్పటికీ ఈ వచనం ద్వారా మరియు అల్లాహ్ స్మరణకు సంబంధించిన ఇతర సద్వచనాల ద్వారా అల్లాహ్‌ను అక్కడ ఎంతగానో స్మరించండి.

“ఖుల్‌హువల్లాహు అహద్ అల్లాహుస్ సమద్ లమ్‌యలిద్ వలం యూలద్ వలం యకుల్లహూ కుఫువన్ అహద్”.

"అల్లాహుమ్మ సల్లిఅలా మహమ్మదిన్ వఅలా ఆలి ముహమ్మదిన్ కమాసల్లైత అలా ఇబ్రాహీమ వ అలాఆలి ఇబ్రాహీమ ఇన్నక మహీదుమ్ మజీద్''. ఏ దుఆయే కస్‌రత్ సే పఢే.

అలాగే హృదయపూర్వకంగా, ఎంతగానో రోదిస్తూ ఆయనను ప్రార్థించండి. అక్కడ ప్రత్యేక వచనాలు పఠించండి, ప్రార్థించండి, మన్నింపు కొరకు అల్లాహ్‌ను వేడుకోండి మరియు ఆయన సన్నిధిలో ఏడవండి. ఇవన్నీ తప్పనిసరి.

అందుకే ప్రార్థించే విషయంలో మరియు ఎంతగానో రోదిస్తూ అల్లాహ్‌ను వేడుకునే విషయంలో ఎంతమాత్రం లోపభూయిష్ఠంగా వ్యవహరించకండి. అన్నింటికంటే ఎక్కువగా మీ కొరకు, మీ తల్లిదండ్రుల కొరకు మన్నింపు మరియు పాప క్షమాపణ కొరకు వేడుకోండి. నరకం నుంచి మరియు అన్నిరకాల శిక్షల నుంచి విముక్తి కొరకు, స్వర్గం మరియు అల్లాహ్ ప్రసన్నత లభించేందుకై ప్రార్థించండి. అలాగే ఇహపర లోకాలలో ప్రతి అవసరం మరియు ప్రతి మేలు కొరకు అల్లాహ్‌ను ప్రార్థించండి. అలాగే మీ పై ఏదయినా హక్కును కలిగియున్నవారందరి కొరకు సైతం ప్రార్థించండి. అలాగే ముస్లిం సమాజమంతటి కొరకు ప్రార్థించండి.

అరఫాత్‌లో మీ గుడారంలో సైతం మీరు ఇదే విధంగా అల్లాహ్ స్మరణలో, ప్రార్థించడంలో, మన్నింపు కొరకు దీనంగా వేడుకోవడంలో నిమగ్నులు కండి.

సాయంత్రవేళ లేదా మీ మార్గదర్శితో పాటు లేదా మరే వ్యక్తితోనయినా లేదా ఒంటరిగా 'జబలె రహ్‌మత్' (రహ్‌మత్ అనే కొండ) మీదికి వెళ్ళే అవకాశం లభించిన పక్షంలో అక్కడ సైతం అల్లాహ్ కారుణ్యం పట్ల పూర్తి నమ్మకంతో ప్రార్థించండి. అది దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) 'హజ్జతుల్ విదా' (ఆఖరి వీడ్కోలు హజ్) సందర్భంలో తమ ప్రసంగాన్ని వెలు వరించిన, అల్లాహ్‌ను ఎంతగానో ప్రార్థించిన స్థలం. అల్లాహ్ తరఫున వాటి స్వీకరణ విషయంలో దైవప్రవక్త(స) కు శుభవార్త లభించింది. అయితే ఆ కొండ మీదికి వెళ్ళడం తప్పనిసరి కాదు. అక్కడికి వెళ్ళిన కారణంగా తీవ్రమైన రద్దీ కారణంగా, కొన్ని సందర్భాలలో సహచరుల నుంచి తప్పిపోయే ప్రమాదమూ ఉంటుంది.

సూర్యాస్తమయం వరకు మీరు అరఫాత్‌లోనే ఉంటారు. సూర్యాస్తమయం తర్వాత మగ్‌రిబ్ నమాజ్ చదవకుండానే మీరు అక్కడినుంచి ముజ్‌దలిఫహ్‌కు వెళ్ళవలసి యుంటుంది.

తల్బియా, ఇస్తిగఫర్, కల్మా తౌహీద్, అల్లాహ్ ప్రార్థన చేస్తున్నప్పుడు, ఖిబ్లా వైపుగా నిలబడి ఉండండి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అరఫాత్ మైదానంలో ఒంటెపై కూర్చుని జబలె రహ్మత్ వద్ద ప్రసంగించారు. ప్రతి హజ్ యాత్రికుడు ప్రవక్త చేసిన ఖుత్బాను అర్ఫాత్ మైదానంలో స్మరించుకుని తమ జీవితంలో తప్పనిసరిగా అమలు చేయాలి.

**ఓ అల్లా ! నీవు హిత బోధనిచ్చిన వారిలోనే నాకు హిత బోధనివ్వు . నీవు స్వస్థత నిచ్చిన వారిలోనే నాకు స్వస్థత ఇవ్వు . నీవు సంరక్షకత్వం వహించిన వారిలోనే నాకు సంరక్షణ కలిపించు. నాకు నీవు ప్రసాదించిన దానిలో నాకు శుభాన్ని ఇవ్వు. నీవు నా కోసం నిర్ణయించిన దానిలో కీడు నుండి నన్ను కాపాడు . నిర్ణయించే వాడవు నీవే. నీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరూ నిర్ణయించలేరు. నీవు మిత్రునిగా చేసుకున్న వారిని ఎవరూ అవమాన పరచలేరు . నీవు విరోధం వహించినవాడు ఎన్నటికీ గౌరవనీయుడు కాలేడు. మా ప్రభూ ! నీవు అమిత శుభములు కలవాడవు. ఉన్నతమైన ఘనత కలవాడవు .**

హిజ్రీ శకం-9లో జరిగిన

# హజ్

డా.ఫజులుల్లా ఖాన్

9 హిజ్రీ సంవత్సరంలో హజ్‌యాత్ర విధిగా చేయబడింది. హజ్ నెలలు కూడా సమీపించాయి. ఇస్లాం స్వీకరించడానికి అనేక తెగల ప్రతినిధి బృందాలు ఎడతెరిపి లేకుండా మదీనా వస్తుండడంవల్ల దైవప్రవక్త(స) ఆ ఏడు హజ్ యాత్రకు బయలుదేరలేక హజ్రత్ అబూ బక్ర్(ర)ని పంపడానికి నిర్ణయించారు.

హజ్‌యాత్ర ప్రకటన వినగానే మదీనాలో అనేక మంది ముస్లింలు అమితోత్సాహంతో మక్కా బయలు దేరడానికి సిద్ధమయ్యారు. దైవప్రవక్త(స) వారందరికీ హజ్రత్ అబూబక్ర్(ర)ని నాయకునిగా నియమించి పంపారు. హజ్రత్ అబూ బక్ర్(ర) నాయకత్వంలో యాత్రికులు మక్కా వెళ్ళిపోయిన తరువాత తౌబా సూరాలోని మొదటి నలభై సూక్తులు అవతరించాయి. ఇవి మక్కా బహు దైవారాధకులకు, హజ్ ఆచారాలకు సంబంధించిన సూక్తులు అయినందున వీటిని మక్కా ప్రజలకు అందజేయవలసి ఉంది. అందువల్ల దైవప్రవక్త(స) వెంటనే హజ్రత్ అలీ(ర)ని పిలిపించి విషయం వివరించారు.

"అలీ! ఈ దైవ సూక్తులు తీసుకొని వెంటనే మక్కా వెళ్ళిపో. ఖుర్బానీ రోజు యాత్రికులంతా 'మీనా'లో గుమికూడిన తరువాత వారికి ఈ సూక్తులు చదివి విన్పించు. అవిశ్వాసులు ఎవరూ స్వర్గ ప్రవేశం చేయలేరని (బహు దైవారాధకులకు, గ్రంథ ప్రజలకు) స్పష్టంగా చెప్పెయ్యి. ఈ సంవత్సరం బహుదైవారాధకులు (ప్రతిష్ఠాలయం పరిధిలో ప్రవేశించి) హజ్ ఆచారాలు చేయడానికి వీల్లేదని, ఏ ఒక్కరూ నగ్నంగా కాబా ప్రదక్షిణ చేయకూడదని ప్రకటన చెయ్యి'' అని చెప్పారు ఆయన(స).

ఆ తరువాత హజ్రత్ అలీ(ర) మదీనా నుండి బయలుదేరి వేగంగా ప్రయాణం సాగించారు. మక్కా చేరుకోక ముందే దారిలో ఆయన హజ్రత్ అబూ బక్ర్ (ర)ని కలుసుకున్నారు. హజ్రత్ అబూ బక్ర్(ర) హజ్రత్ అలీ(ర)ని చూసి ఆశ్చర్యపోతూ, "ఏమిటీ, నాయకునిగా వచ్చావా లేక అనుచరునిగా వచ్చావా?'' అని అడిగారు. దానికి హజ్రత్ అలీ(ర) తాను యాత్రిక బృందానికి నాయకునిగా రాలేదని చెప్పారు. ఆ తరువాత ఆయన దైవప్రవక్త(స) తనకు పురమాయించిన పని గురించి తెలియజేశారు. హజ్ యాత్రికులు మక్కా పట్టణం చేరుకున్నారు. హజ్రత్ అబూ బక్ర్(ర) నాయకత్వంలో ఖుర్‌ఆన్ వెలుగులో ఆయన చెప్పిన పద్ధతుల ప్రకారం అందరూ హజ్ విధులు నిర్వహించారు.

హజ్ ఆచారాలలో పశువుల్ని(ఖుర్బానీ) ఇవ్వడం ఉంది. ఆ బలి దినం కూడా వచ్చింది. యాత్రికులందరూ ఆ రోజు 'మీనా' ప్రదేశానికి చేరుకున్నారు. అందరూ చేరిన తరువాత హజ్రత్ అలీ(ర) దైవప్రవక్త(స) ఆదేశం ప్రకారం ఖుర్‌ఆన్‌లోని తౌబా సూరాకు చెందిన ఈ సూక్తులు పఠించి విన్పించారు.

''మీరు ఒప్పందాలు కుదుర్చుకున్న ముష్రిక్కులతో ఇక మీదట ఎలాంటి సంబంధాలు వుండవు. అల్లాహ్ తరఫున, ఆయన ప్రవక్త తరఫున ప్రకటించబడింది. కనుక (ఓ ముష్రిక్కులారా!) ఇక మీరు నాలుగు మాసాల వరకు రాజ్యంలో సంచరించండి. మీరు అల్లాహ్‌ను అశక్తుణ్ణి చెయ్యలేరన్న సంగతి బాగా తెలుసుకోండి. అల్లాహ్ అవిశ్వాసులను పరాభవం పాల్జేస్తాడు (అన్న సంగతిని కూడా మరువకండి).'' (ఖుర్‌ఆన్ 9:1,2).

"అల్లాహ్ తరఫు నుంచీ, ఆయన ప్రవక్త తరఫు నుంచీ పెద్ద హజ్ దినాన ప్రజలకు తెలియజేయునది ఏమనగా, అల్లాహ్ ముష్రిక్కులకు ఏ విధంగానూ బాధ్యుడు కాడు - ఆయన ప్రవక్త కూడా. కాబట్టి ఇప్పటికయినా మీరు పశ్చాత్తాపం చెందితే అది మీకే శ్రేయస్కరం. ఒకవేళ మీరు

విముఖులైతే, మీరు ఎట్టి పరిస్థితులలోనూ అల్లాహ్‌ను ఓడించలేరన్న సంగతిని తెలుసుకోండి. (ఓ ప్రవక్తా!) అవిశ్వాసులకు వ్యధాభరితమైన శిక్ష ఉంటుందన్న శుభ వార్తను వినిపించు.'' (ఖుర్‌ఆన్ 9:3).

"అయితే మీరు ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత మీకు ఎలాంటి నష్టం చేకూర్చడంగానీ, మీకు వ్యతిరేకంగా ఎవరికైనా సహాయం చేయటంగానీ చేయకుండా ఉన్న ముష్రిక్కులకు మాత్రం (ఈ ప్రకటన నుంచి) మినహాయింపు ఉంది. మీరు కూడా వారితో పాటు వారి ఒప్పంద గడువును పూర్తి చేయండి. నిశ్చయంగా అల్లాహ్ భయభక్తులుగల వారిని ప్రేమిస్తాడు.'' (ఖుర్‌ఆన్ 9:4).

"మరి నిషిద్ధ(గౌరవ ప్రదమైన) మాసాలు గడచి పోగానే ముష్రిక్కులను నిర్బంధించండి. ముట్టడించండి. ఒకవేళ వారు పశ్చాత్తాపం చెంది, నమాజును నెలకొల్పితే, జకాతును విధిగా చెల్లిస్తే వారి మార్గాన వారిని వదలి పెట్టండి. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించే వాడు. ఒకవేళ ముష్రిక్కులలోని ఏ వ్యక్తి అయినా నీ శరణు కోరితే, అతను దైవవాణి వినేంత వరకు అతనికి నువ్వు ఆశ్రయ మివ్వు. ఆ తరువాత అతన్ని అతని సురక్షిత స్థానానికి చేర్చు. వారు తెలియని వారవటం చేత వారి పట్ల ఈ విధంగా వ్యవహరించాలి.'' (ఖుర్‌ఆన్ 9:5,6).

"అల్లాహ్ వద్ద, ఆయన ప్రవక్త వద్ద ముష్రిక్కులకు ఒప్పందం ఎలా సాధ్యం? అయితే మీరు మస్జిదె హరామ్ దగ్గర ఎవరితో ఒప్పందం చేసుకున్నారో వారు మీ ఒప్పందానికి కట్టుబడి ఉన్నంత వరకూ మీరు కూడా వారి ఒప్పందాన్ని గౌరవించండి. నిశ్చయంగా అల్లాహ్ భయభక్తులు గల వారిని ప్రేమిస్తాడు.

వారి వాగ్దానాలు ఏ మేరకు నమ్మశక్యం? మీపై వారికి ఏకాస్త ఆధిక్యత లభించినా వారు మీ విషయంలో ఏ బంధుత్వాన్నీ, ఏ ఒడంబడికనూ ఖాతరు చేయరు. వారు తమ నోటి మాటలతో మిమ్మల్ని సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు. కాని వారి హృదయాలు మాత్రం ఎంతకీ అంగీకరించటం లేదు. వారిలో అత్యధికులు అవిధేయులు.'' (ఖుర్‌ఆన్ 9:7,8).

"వారు అల్లాహ్ వాక్కులను అతి స్వల్పమైన ధరకు అమ్మేశారు. ఆయన మార్గం నుంచి ప్రజలను ఆపారు. వారి చేష్టలు బహు చెడ్డవి. ఏ ముస్లిం విషయం లోనూ వారు బంధుత్వ సంబంధాలను, ఒప్పంద మర్యాద లనూ ఏమాత్రం ఖాతరు చేయరు. హద్దులు మీరే వారు వీరే. ఇప్పటికయినా వారు పశ్చాత్తాపం చెంది, నమాజ్‌ను నెలకొల్పుతూ, జకాత్ ను విధిగా చెల్లించటం మొదలెడితే వారు మీ ధార్మిక సోదరులే. తెలిసిన వారి కోసం మేము మా ఆయతులను ఈ విధంగా విడ మరచి చెబుతున్నాము.'' (ఖుర్‌ఆన్ 9:9-11).

"ఒకవేళ ఒప్పందం చేసుకున్న తరువాత కూడా వీళ్లు తమ ప్రమాణాలను భంగపరచి, మీ ధర్మాన్ని ఎగతాళి చేస్తే మీరు కూడా ఆ అవిశ్వాస నాయకులతో తలపడండి. ఇంక వారి ప్రమాణాలకు ఏపాటి విలువాలేదు. బహుశా(తగిన శాస్తి జరిగిన తరువాతనే) వారు (తమ దుశ్చేష్టలను) మానుకుంటారేమో.'' (ఖుర్‌ఆన్ 9:12).

"ముష్రిక్కులు (ఒకవైపు) తాము స్వయంగా తమ అవిశ్వాసాన్ని గురించి సాక్ష్యమిస్తూనే (మరోవైపు) అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు ఎంత మాత్రం తగరు. వారి కర్మలన్నీ వృథా అయిపోయాయి. శాశ్వతంగా వారు నరకాగ్నిలో ఉంటారు. (ఖుర్‌ఆన్ 9:17).

"అల్లాహ్‌ను, అంతిమదినాన్నీ విశ్వసిస్తూ, నమాజులను నెలకొల్పుతూ, జకాత్‌ను విధిగా చెల్లిస్తూ, అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడనివారు మాత్రమే అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు తగిన వారు. సన్మార్గ భాగ్యం పొందినవారు వీరేనని ఆశించవచ్చు.'' (ఖుర్‌ఆన్ 9:18).

"ఓ విశ్వాసులారా! ముష్రిక్కులు అశుద్ధులు. కాబట్టి ఈ ఏడాది తరువాత వారు మస్జిదె హరామ్ దరిదాపులకు కూడా రాకూడదు. ఒకవేళ మీకు దారిద్ర్య భయం ఉంటే అల్లాహ్ గనక తలిస్తే తన కృపతో మిమ్మల్ని సంపన్నులుగా చేస్తాడు. అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, వివేకవంతుడు.'' (ఖుర్‌ఆన్ 9:28).

"వారు అల్లాహ్ జ్యోతిని తమ నోటితో (ఊది) ఆర్పివేయాలని కోరుతున్నారు. అయితే అల్లాహ్,

అవిశ్వాసులకు ఎంతగా సహించరానిదైనా సరే - తన జ్యోతిని పరిపూర్ణం చేయకుండా వదలి పెట్టటానికి అంగీకరించడు. ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు-ముష్రిక్కులకు ఎంత సహించరానిదయినా సరే ఇతర ధర్మాలపై దానికి ఆధిక్యతను వొసగటానికి!" (ఖుర్‌ఆన్ 9:32,33).

"నెలలను ముందుకు, వెనక్కి మార్చటం ఓ అదనపు అవిశ్వాస చేష్ట. ఈ చేష్ట ద్వారా అవిశ్వాసులు మార్గ భ్రష్టతలో పడవేయబడుతున్నారు. ఒక ఏడాది వారు దాన్ని ధర్మసమ్మతం చేసుకుని, మరో ఏడాది దాన్నే నిషిద్ధంగా ఖరారు చేసుకుంటారు. అల్లాహ్ నిషిద్ధ పరచిన మాసాల గణనలో సారూప్యం సాధించడానికి, అల్లాహ్ నిషేధించిన దానిని ధర్మసమ్మతం చేసుకోవటానికి (వారు ఇలా చేస్తారు). వారి దుష్టచేష్టలు వారికి అందమైనవిగా చూపబడ్డాయి. అవిశ్వాస జనులకు అల్లాహ్ సన్మార్గం చూపడు.'' (ఖుర్‌ఆన్ 9:37).

# తెలుసుకోవాల్సిన అరబీ పదాలు

| | | | |
|---|---|---|---|
| ఆదివారం | అహాత్, హాత్ | సాయంత్రం | అసర్ (మగరూప్) |
| సోమవారం | ఇత్నీన్ | రాత్రి | బిల్లైల్ |
| మంగళవారం | తోలుత,తలత | అష్రా | 10 |
| బుధవారం | హోర్బొ,,హర్బా | అష్రిం | 20 |
| గురువారం | కమ్మీస్ | తలతిన్ | 30 |
| శుక్రవారం | జుమ్మా | హర్బీన్ | 40 |
| శనివారం | సఫ్త్ | కంసిన్ | 50 |
| మీమ్మల్ని ఎవరైన ఈ రోజు ఏ వారం అని అడిగితే.. | | సిత్తిన్ | 60 |
| మొన్న | అవ్వల్(అమ్స్) ఏంస్ | సభాయిన్ | 70 |
| నిన్నా | (అమ్స్) ఏంస్ | తమనియిన్ | 80 |
| ఈ రోజు | ఇల్యోమ్ | తిస్సాయిన్ | 90 |
| రేపు | బుక్ రా | మియ్యా | 100 |
| ఏల్లుండి | బాద్ బుక్ రా | మిత్తేన్ | 200 |
| ఒకరోజు | వాహేద్ యొమ్ | కంసామియ్యా | 500 |
| ఒక వారం | ఉస్బుక్ వాహేద్ | అల్ఫ్ | 1000 |
| ఒక నేలా | వాహేద్ షార్ | అల్ఫిన్ | 2000 |
| ఒక సంవత్సరం | వాహేద్ సాణా | అష్రా అల్ఫ్ | 10000 |
| ఉదయం | సుబా | మియ్యా అల్ఫ్ | 100000 |
| పగలు | దోహార్ | మిత్తేన్ అల్ఫ్ | 200000 |

# హజ్ ముఖ్యమైన దుఆలు..

-ముఫ్తి ముహమ్మద్ ఫారూక్ అల్ ఖాసిమీ

**హజ్జె ఇఫ్రాద్:** హజ్ దినాలలో ఇహ్రామ్ ధరించి కేవలం హజ్ చేస్తున్నానని నియ్యత్ (సంకల్పం) చేసి హజ్ కార్యాలు పూర్తి చేసి ఇహ్రామ్‌ను తొలగిస్తారు. దీనినే హజ్జె ఇఫ్రాద్ అంటారు.

**నియ్యత్:** "అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుల్ హజ్జ ఫయస్సిర్ హులీ వతఖబ్బల్‌హు మిన్ని"

**తర్జుమా:** ఓ! అల్లాహ్! నేను హజ్ కోసం సంకల్పం చేయుచున్నాను. ఈ కార్యాన్ని నాకు సరళతరం చేయి. దీన్ని స్వీకరించు."

**హజ్జె ఖిరాన్:** హజ్ మరియు ఉమ్రాల కోసం ఒకే సారి నియ్యత్ చేసుకుంటారు. ఇహ్రామ్ ధరించి మొదట ఉమ్రా చేస్తారు. అదే ఇహ్రామ్‌తో హజ్‌ను ముగించుకొని ఇహ్రామ్ తొలగిస్తారు. ఖిరాన్ అనగా రెండు కలిపి చేయటం అని అర్థం.

**నియ్యత్:** "అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుల్ హజ్జ వల్ ఉమ్‌రత ఫయస్సిర్‌హులీ వతఖబ్బల్‌హుమా మిన్ని"

**తర్జుమా:** ఓ! అల్లాహ్! నేను హజ్, ఉమ్రాలను కలిపి చేయుటకు సంకల్పం చేయుచున్నాను. ఈ కార్యాన్ని నాకు సరళతరం చేయి. దీన్ని స్వీకరించు."

**హజ్జె తమత్తు:** హజ్ దినాల ముందు మొదట ఉమ్రా కోసం నియ్యత్ చేసి ఇహ్రామ్ ధరించి ఉమ్రా పూర్తి చేసుకుంటారు. ఉమ్రా పూర్తి అయిన తదుపరి ఇహ్రామ్ దుస్తులను తొలగిస్తారు.

**నియ్యత్:** "అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుల్ ఉమ్‌రత ఫయస్సిర్‌హులీ వతఖబ్బల్‌హా మిన్ని"

**తర్జుమా:** ఓ! అల్లాహ్! నేను ఉమ్రా కొరకు సంకల్పం చేయుచున్నాను. ఈ కార్యాన్ని నాకు సరళతరం చేయి. దీన్ని స్వీకరించు." మరల జిల్ హిజ్జా 8వ తేదీన హజ్ కొరకు సంకల్పం చేసుకొని ఇహ్రామ్ ధరించి హజ్ కార్యక్రమాలను పూర్తి చేసి ఇహ్రామ్‌ను తొలగిస్తారు. భారతదేశం నుంచి వెళ్ళే హాజీలు తమత్తు విధానాన్ని అనుసరిస్తారు.

**పురుషుల ఇహ్రామ్ - స్త్రీల ఇహ్రామ్:** పురుషులు రెండున్నర గజాల పొడవు, ఒకటిం పావు గజం వెడల్పు గల రెండు వస్త్రాలు ఉపయోగించాలి. ఒకటి లుంగీలాగ సడుంకు చుట్టుకుని, రెండవది భుజాల మీద కప్పుకోవాలి. స్త్రీలు తలకు చుట్టుకోవడానికి ఒక రుమాలు. రోజువారి వస్త్రాలు.

**ముహ్రిమ్:** ఇహ్రామ్ తొడిగి రెండు రకాతుల నమాజ్ చేయాలి. 3 సార్లు తల్బియా పఠించాలి. ఇప్పుడు ముహ్రిమ్ అని అనబడతారు. తల్బియా పఠిస్తూ వుండాలి.

**తల్‌బియా:** లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హమ్‌ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీక లక

**మస్జిదె హరామ్‌లోకి ప్రవేశించే సమయంలో క్రింది దుఆ**

**"రబ్బిగ్‌ఫిర్‌లీ వఫ్ తహ్‌లీ అబ్‌వాబ రహ్‌మతిక్"**

**తర్జుమా:** "ఓ నా ప్రభువా! నా పాపాలను క్షమించు. అలాగే నా కొరకు నీ అనుగ్రహపు ద్వారాలను తెరువు".

**కాబా గృహంపై మొట్టమొదటి దృష్టి నిలిచినప్పుడు పఠించవలసిన దుఆ**

కాబా గృహాన్ని చూడండి. కాబాగృహంపై మీ దృష్టిని నిలిపి ఉంచండి. రెప్పవాల్చకుండా క్రింది దుఆను పఠించండి.

**"ఓ అల్లాహ్! దీని తర్వాత నేను మంచికి సంబంధించి ఏమి ప్రార్థించినా దానిని స్వీకరించు".** ఆ తర్వాత మూడు సార్లు క్రింది దుఆను పఠించండి. **"అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్".**

**తర్జుమా:** "అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు".

ఈ దుఆ కాకుండా మీరు తక్బీర్‌ను సైతం పఠించవచ్చు. **"అల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్. లా ఇలాహ ఇల్లల్లాహు**

**వల్లాహు అక్బర్. అల్లాహు అక్బర్ వలిల్లా హిల్ హమ్ద్".**

**తర్జుమా:** "అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. మరియు అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు మరియు సమస్త స్తోత్రాలు అల్లాహ్ కొరకే!''

**ఆ తరువాత దరూదె షరీఫ్ పఠించండి.** ఆ తర్వాత మీరు హృదయ పూర్వకంగా అల్లాహ్‌ను మీరు కోరుకునే వాటి కొరకు ప్రార్థించండి.

**తవ్వాఫ్:** తవ్వాఫ్ హజ్‌రె అస్వద్ నుంచి మొదలయి హజ్‌రె అస్వద్ వద్దే ముగుస్తుంది. అయితే హజ్‌రెఅస్వద్ ముందరి ప్రదేశాన్ని అంచనా వేసేందుకై తూర్పు దిశగా ముతాఫ్‌లో గోడ మీద మరియు చుట్టూ ఉన్న మస్జిదె హరామ్ పై కప్పు మీద మరియు టెర్రస్ మీద ఉన్న స్తంభాలపై ఆకుపచ్చని ట్యూబ్‌లైట్లు అమర్చబడి ఉన్నాయి. వాటి ద్వారా మీరు హజ్‌రె అస్వద్ ముందరి ప్రదేశాన్ని అంచనా వేయగలుగుతారు. మీ తవ్వాఫ్ ఆ గుర్తు వద్ద నుంచే మొదలయి ఆ గుర్తు వద్దే ముగుస్తుంది. కాబా గృహం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణాలు చేయడాన్ని తవాఫ్ అంటారు. తవాఫ్ చేయాలనుకునే వ్యక్తి వుజూ స్థితిలో ఉండాలి. పరిశుభ్రంగా ఉండాలి. స్త్రీలయితే బహిష్టు, పురిటి రక్తస్రావం వంటి వాటి నుంచి పరిశుభ్రంగా ఉండాలి. ఒక తవ్వాఫ్‌ను పూర్తి చేసేందుకై కాబా గృహం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేయవలసి ఉంటుంది. అలాగే తవ్వాఫ్ ముగిసిన తర్వాత రెండు రకాతులు 'వాజిబుత్తవ్వాఫ్' నమాజ్ చదవవలసి ఉంటుంది.

**కాబా గృహం నలుమూలల పేర్లు:** దీర్ఘచతురస్రాకారంలో ఉన్న కాబా ఈశాన్యమూలను రుకునె ఇరాఖీ, వాయువ్య మూలని రుకునే షామీ, నైరుతి మూలను రుకునె యమనీ, ఆగ్నేయ మూలను రుకునె సూద్ అంటారు.

**ముల్తజిమ్ ప్రాంతం:** హజ్రె అస్వద్, కాబా కూడలి మధ్య

**మతాఫ్:** కాబా గృహం నలువైపుల తవాఫ్ చేసే ప్రదేశం.

**రమల్:** ఉమ్‌రహ్‌కు చెందిన తవ్వాఫ్‌లో మరియు హజ్‌కు చెందిన తవ్వాఫ్ జియారత్‌లోనూ మొదటి మూడు ప్రదక్షిణలు చేసే సమయంలో పురుషులు యోధుల వలె, పహిల్వాన్‌ల వలె ఛాతీని ముందుకు తెచ్చి చిన్న చిన్న అడుగులు వేస్తూ వేగంగా నడవవలసి ఉంటుంది. ఆ విధంగా నడవడాన్ని 'రమల్' అంటారు.

**ఇజ్‌తిబాఅ:** రమల్ చేసే సమయంలో కుడిచేతి భుజాన్ని బహిర్గతం కావించి (వస్త్రంతో కప్పకుండా) ఉంచడం జరుగుతుంది. ఆ విధంగా చేయడాన్ని 'ఇజ్‌తిబాఅ' అంటారు. ఇజ్‌తిబాఅ కొరకు ఇహ్‌రామ్ వస్త్రానికి చెందిన ఒక భాగాన్ని కుడి చేతి చంక కింది నుంచి పోనిచ్చి ఎడమచేతి భుజం మీద వేసుకోవడం జరుగుతుంది.

**హజ్‌రె అస్వద్ వైపుకు అభిముఖులయి తవ్వాఫ్ కొరకు ఈ క్రింది విధంగా నియ్యత్ చేసుకోండి.**

**"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదు తవాఫ్ బైతికల్ హరామి సబ్‌అత అష్‌వతిల్లాహి తాలా ఫయస్సర్‌హూ లీ వ తఖబ్బల్‌హూ మిన్నీ".**

**తర్జుమా:** ''ఓ అల్లాహ్! నేను నీకు చెందిన ఈ గౌరవనీయమైన గృహం చుట్టూ నీ ప్రీతిని, అనుగ్రహాన్ని పొందే ఉద్దేశ్యంతో తవ్వాఫ్ చేస్తున్నాను. నీవు దీనిని నా కొరకు సులభతరం కావించు మరియు స్వీకరించు''. నియ్యత్ చేసిన తర్వాత మీరు హజ్‌రె అస్వద్ మరియు ఆకు పచ్చని ట్యూబ్ లైట్‌కు సరిగ్గా మధ్య భాగానికి చేరుకునేటట్లు కుడివైపుకు జరగండి. ఆ తర్వాత క్రింద పేర్కొనబడిన తక్బీర్‌ను పఠిస్తూ నమాజ్‌ను ప్రారంభిస్తున్న సమయంలో చెవుల వరకు చేతులను ఏ విధంగానయితే ఎత్తుతారో అదే విధంగా ఎత్తండి.

**"బిస్మిల్లాహి అల్లాహు అక్బర్. వలిల్లా హిల్ హమ్ద్"**

**తర్జుమా:** అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు మరియు సకల స్తోత్రాలు అల్లాహ్ కొరకే''. పైన పేర్కొనబడిన తక్బీర్‌ను పలికిన తర్వాత చేతులను వదిలివేయాలి.

**ఇస్తిలామ్:** ఒక వేళ హజ్‌రె అస్వద్ మీరు తాకగలిగినంత సమీపంలో ఉన్నట్లయితే హజ్‌రె అస్వద్ దిశగా రెండు

అరచేతులను హజ్రె అస్వద్‌ను తాకేందుకై మీరు ప్రయత్నిస్తున్నట్లుగా సూచిస్తూ భుజాల వరకు పైకెత్తాలి. ఆ తర్వాత అరిచేతులను చుంబించండి. (ముద్దు పెట్టు కోండి). ఆ విధంగా చేయడమనేది హజ్రె అస్వద్‌ను చుంబించడానికి సమానం. ఈ విధంగా చేయడాన్ని 'ఇస్తిలామ్' అంటారు. ఇస్తిలామ్ చేసిన తర్వాత మీరు తవ్వాఫ్ చేసే దిశ వైపుకు మరలి తవ్వాఫ్‌ను ప్రారంభించండి.

కాబా గృహం నాలుగు మూలలను కలిగి యున్నది. తవ్వాఫ్ చేస్తున్నప్పుడు హజ్రె అస్వద్ అమర్చబడియున్న కాబా గృహానికి చెందిన మొదటి మూల నుంచి మూడవ మూలకు చేరుకునేంత వరకు మీరు మూడవ కలిమ్‌ను పఠించండి.

**"సుబ్‌హానల్లాహి వల్‌హందులిల్లాహి వలాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. వలా హౌలా వలా ఖువ్వత్ ఇల్లా బిల్లా హిల్ అలియ్యిల్ అజీమ్"**

**తర్జుమా:** "అల్లాహ్ పరమ పవిత్రుడు. సకల స్తోత్రాలూ అల్లాహ్ కొరకే! అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు. పాపాల నుంచి రక్షించుకునే శక్తి, సత్కార్యం వైపు మరలే శక్తి అల్లాహ్ తరపు నుంచి మాత్రమే ప్రాప్తమవుతుంది.

కాబాగృహానికి చెందిన మూడవ మూలను 'రుక్నె యమానీ' అని పిలుస్తారు. రుక్నె యమానీ నుంచి తిరిగి హజ్రె అస్వద్ వరకు చేరుకునేంత వరకు క్రింది దుఆను పఠించాలి.

**"రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతవ్ వఫిల్ ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్".**(ఖుర్‌ఆన్, అల్‌బఖరహ్)

**తర్జుమా:** "ఓ మా ప్రభువా! మాకు ప్రపంచంలోనూ శ్రేయస్సును ప్రసాదించు. అలాగే పరలోకంలోనూ శ్రేయస్సును ప్రసాదించు. అలాగే మమ్మల్ని నరకాగ్ని నుంచి రక్షించు".

రుకెన్ యమానీ మరియు హజ్రె అస్వద్‌కు నడుమ 70 వేల దైవదూతలు తవ్వాఫ్ చేస్తున్న వారి ప్రార్థనలకు ఆమీన్ పలుకుతారు. అందుకే పైన పేర్కొనబడిన దుఆను (అది ఖుర్‌ఆన్‌లోని ఒక ఆయత్ కూడా అయినందున) పఠించడం ఎంతో ఉత్తమం.

తవ్వాఫ్ చేస్తున్న సమయంలో కాబా గృహం వైపుకు ముఖభాగాన్ని ఉంచడం మక్రూహ్ (అవాంఛనీయ చర్య). అయితే వీపును కాబా గృహం వైపు ఉంచడమయితే మక్రూహ్ తహ్‌రీమీ (హరామ్ స్థాయికి దగ్గరగా ఉన్న అవాంఛనీయ చర్య). కనుక తవ్వాఫ్ చేస్తున్న సమయంలో చూపులను నడుస్తున్న ప్రదేశం వైపు ఉంచి నేరుగా సాగిపోవాలి.

<u>తవ్వాఫ్‌కు చెందిన రెండవ ప్రదక్షిణ</u>

రుకెన్ యమానీ నుంచి దుఆ పఠిస్తూ మీరు హజ్రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్‌కు మధ్య భాగంలో నల్లని పట్టీ మీదికి చేరుకున్నప్పుడు హజ్రె అస్వద్ వైపుకు వక్షభాగాన్ని తిప్పకుండా కేవలం ముఖభాగాన్ని తిప్పాలి. అలాగే అరి చేతులను హజ్రె అస్వద్ వైపుకు తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. (ముద్దు పెట్టుకోవాలి).

**"బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ వలిల్లా హిల్ హమ్ద్"**

తర్జుమా: అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను. అల్లాహ్ అందరి కంటే గొప్ప వాడు మరియు సకల స్తోత్రాలూ అల్లాహ్ కొరకే".

హజ్రె అస్వద్ వైపుకు వక్షభాగాన్ని ఉంచి పూర్తిగా అభిముఖులయి కేవలం మొదటి తవ్వాఫ్‌ను ప్రారంభిస్తున్నప్పుడు మాత్రమే నియ్యత్ చేసుకోవడం, తక్బీర్ పఠించడం, ఇస్తిలామ్ చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ప్రతి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న సమయంలో కేవలం ముఖభాగాన్ని మాత్రమే హజ్రె అస్వద్ వైపుకు తిప్పి ఉంచి అరచేతులను హజ్రె అస్వద్ వైపుకు తిప్పి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. ఆ సమయంలో మీ వక్షభాగం తవ్వాఫ్ చేయబడే దిశలోనే ఉంచాలి.

ఇస్తిలామ్ చేసిన తర్వాత ముందు చేసినట్లుగానే రుక్నె యమానీ వరకు మూడవ కలిమహ్‌ను పఠించండి. ఆ తర్వాత రుక్నె యమానీ నుంచి తిరిగి హజ్రె అస్వద్‌కు

చేరుకునేంత వరకు ఇంతకు ముందు పేర్కొనబడిన దుఆను పఠించాలి. ఆ విధంగా ఏడు ప్రదక్షిణలను పూర్తి చేసినప్పుడు ఒక తవ్వాఫ్ పూర్తవుతుంది.

మీ చేతిలో ఏడు గుళికల మాలను ఉంచుకోండి. ప్రతి ప్రదక్షిణ ముగిసిన తర్వాత ఒక గుళికను తగ్గిస్తూ ప్రదక్షిణలను లెక్కించండి. ఏడవ ప్రదక్షిణ ముగిసినప్పుడు హజ్రె అస్వద్ వైపుకు ముఖభాగాన్ని, అరిచేతులను తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. అనగా ఇస్తిలామ్ చేయాలి. (అది మీ యొక్క ఎనిమిదవ ఇస్తిలామ్) అప్పటి వరకు బహిర్గతమయి ఉన్న మీ యొక్క కుడి భుజాన్ని వస్త్రంతో కప్పి వేసి ముఖామె ఇబ్రాహీమ్ వెనుక భాగానికి వచ్చేయండిం. ఆ వైపున కాబాగృహానికి చెందిన తలుపు కూడా ఉంది. అప్పుడు తవ్వాఫ్ చేసే వారి కొరకు స్థలం విడిచి రెండు రకాతుల నమాజ్‌ను 'వాజిబుత్తవాఫ్' చదువుతున్నట్లుగా నియ్యత్ చేసుకొని చదవండి. ఆ విధంగా చేయడం వల్ల మీ తవ్వాఫ్ ఆచరణ పూర్తవుతుంది.

**జమ్ జమ్ నీటిని త్రాగడం**

రెండు రకాతుల వాజిబుత్తవాఫ్ నమాజ్ చదివిన తర్వాత మీరు కడుపు నిండా జమ్ జమ్ నీటిని త్రాగండి. జమ్ జమ్ నీటిని ఖిబ్లాహ్ వైపుకు అభిముఖులై నిలబడి **'బిస్మిల్లాహ్'** అని పలికి త్రాగాలి. నీటిని త్రాగిన తర్వాత క్రింద పేర్కొనబడిన దుఆను పఠించండి.

**"అల్లాహుమ్మ ఇన్నీ అస్ అలుక ఇల్‌మన్‌నాఫిఅ వరిజ్‌ఖవ్ వాసిఅ వషిఫాఅమ్ మిన్ కుల్లి దాఅ"**

**తర్జుమా:** "ఓ అల్లాహ్! నాకు ప్రయోజనదాయకమైన జ్ఞానాన్ని ప్రసాదించు. భుక్తిలో విస్తృతిని ప్రసాదించు. అలాగే ప్రతి వ్యాధి నుంచీ ఆరోగ్యాన్ని ప్రసాదించు"

హజ్రత్ జాబిర్(ర) ఈవిధంగా ఉల్లేఖించారు" జమ్ జమ్ అనేది దేని కొరకు ఉద్దేశించి తాగబడుతుందో దాని కొరకు ఉద్దేశించబడినది" (ఇబ్నెమాజహ్) అనగా జమ్ జమ్ నీటిని త్రాగే వ్యక్తి ఏ సంకల్పంతో త్రాగినా అల్లాహ్ అతడి సంకల్పాన్ని నెరవేరుస్తాడు.

జమ్ జమ్ నీటిని త్రాగిన తర్వాత తిరిగి హజ్రె అస్వద్ మరియు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్ మధ్య భాగానికి చేరుకోవాలి. తిరిగి ఒక పర్యాయం హజ్రె అస్వద్ వైపుకు అరిచేతులను తిప్పి ఉంచి తక్బీర్ పఠిస్తూ చుంబించాలి. అనగా ఇస్తిలామ్ చేయాలి. అది మీ యొక్క తొమ్మిదవ ఇస్తిలామ్ తర్వాత మీరు ఆకుపచ్చని ట్యూబ్‌లైట్ వైపుకు కాబా గృహానికి దూరంగా నడుస్తూ పోవాలి. ఆ విధంగా మీరు సఫా ప్రదేశానికి చేరుకుంటారు.

**సఫా, మర్వహ్‌ల మధ్య సఈ చేయడం**

సఫా మరియు మర్వహ్‌లు తొలుత చిన్న కొండలుగా ఉండేవి. ఇప్పుడు కేవలం రెండు ఎత్తయిన ప్రదేశాలుగా మాత్రమే ఉన్నాయి. సౌదీ ప్రభుత్వం సఫా మరియు మర్వహ్‌లను సఈ చేయబడే ప్రదేశాలన్నింటినీ మస్జిదె హరామ్ కట్టడంలోనే ఇమిడ్చి నవీన నిర్మాణాన్ని పూర్తి చేసింది. సఫా వద్దకు చేరుకొని కాబా గృహం వైపుకు అభిముఖులై సఈ కొరకు క్రింది నియ్యత్ చేసుకోవాలి

**"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుస్సఅయ బైన స్సఫా వల్ మర్‌వత సుబ్అత అష్ వాతిన్ లి వజ్‌హికల్ కరీమ్. ఫయస్సర్‌హూ లీ వ తఖబ్బల్‌హుమిన్నీ"**

**తర్జుమా:** "ఓ అల్లాహ్! కేవలం నీ ప్రీతిని పొందే ఉద్దేశ్యంతో నేను సఫా మరియు మర్వహ్‌ల నడుమ ఏడు చక్కర్లతో సఈ చేయాలనుకుంటున్నాను. నా కొరకు సఈ చేయడాన్ని సులభతరం కావించు మరియు స్వీకరించు"

నియ్యత్ చేస్తున్న సమయంలో చేతులను దుఆ చేస్తున్న సమయంలో ఎత్తే రీతిలో పైకెత్తాలి. నమాజ్ కొరకు తక్బీర్ పలుకుతున్న సమయంలో ఎత్తే రీతిలో పైకెత్తకూడదు.

**మక్కాలోని ఈ క్రింది 15 ప్రదేశాలలో దుఆ తప్పకుండా స్వీకరించబడుతుంది.**

1) ముతాఫ్ (తవ్వాఫ్ చేయబడే ప్రదేశం)

2) ముల్‌తజిమ్ (కాబా గృహం)

3) మీజాబె రహ్‌మత్ క్రింది భాగం (కాబా గృహం పైకప్పు యొక్క తూము)

4) హతీమ్, 5) కాబా గృహం లోపల

6) జమ్ జమ్ బావి సమీపంలో

7) మఖామె ఇబ్రాహీమ్ వెనుక భాగం

8) సఫా, 9) మర్వహ్

10) సఫా మరియు మర్వహ్‌ల మధ్య సఈ చేయబడే ప్రదేశం ముఖ్యంగా రెండు ఆకుపచ్చని స్తంభాల మధ్యభాగం.

11) అరఫాత్

12) ముజ్‌దలిఫహ్

13) మినాలో చిన్న షైతాన్ మరియు మధ్యస్థ స్థాయి షైతాన్ సమీపంలో. 14) హజ్‌రె అస్వద్ మరియు రుక్‌నె యమానీల మధ్య భాగం

15) హజ్‌రె అస్వద్‌కు సమీపంలో సఫా, మర్వహ్ మరియు సఈ చేయబడే ప్రదేశాలు తప్పకుండా దుఆ స్వీకరించబడే ప్రదేశాలు. కనుక సఈ చేసే సమయంలో మరియు సఈ పూర్తి చేసిన తర్వాత మీరు సఫా మరియు మర్వహ్‌ల మధ్య నిలిచియున్న సమయంలో అల్లాహ్‌ను బాగా ప్రార్థించండి. మీ పాపాల క్షమాపణ కొరకు వేడుకోండి.

సఫా మరియు మర్వహ్‌ల నడుమ మీరు ఎప్పుడయితే నిలిచి ఉండడం జరుగుతుందో అప్పుడు మూడు సార్లు నాల్గవ కలిమహ్‌ను, ఒక పర్యాయం మూడవ కలిమహ్‌ను పఠించండి. సఈ చేస్తున్న సమయంలో ఎక్కువగా నాల్గవ కలిమహ్‌ను పఠించండి. ఇది సులభమైన ఆరాధనా విధానం. సఫా మరియు మర్వహ్‌ల నడుమ ఏడు సఈల కొరకు వేర్వేరు దుఆలు పేర్కొనబడ్డాయి.

**అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్. అల్‌హమ్దులిల్లాహి అలా మా అల్ హమ్‌నా అల్ హమ్దులిల్లా హిల్లజీ హదానా వమా కున్నా లి నహ్‌తదియ లౌల అన్ హదానల్లాహు. లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీకలహు లహుల్ ముల్కు వలహుల్ హమ్దు యుహ్‌యీ వ యుమీతు వహువ హయ్యున్ లా యమూతు బియదిహిల్ ఖైరు. వహువ అలాకుల్లి షయిన్ ఖదీర్. లా ఇలాహ ఇల్లల్లాహు వఅదహు వసదఖ వఅదహు వ నసర అబ్‌దహు వఆ అజ్జ జందహు వహజమల్ అహ్‌జాబ వహ్‌దహు లా ఇలాహ ఇల్లల్లాహు వలా నఅబుదు ఇల్లా ఇయ్యాహు ముఖ్‌లిసీన లహుద్దీన వలౌ కరిహల్ కాఫిరూన అల్లాహుమ్మ ఇన్నక ఖుల్‌త వఖౌలుకల్ హఖ్ఖు ఉద్‌ఊనీ అస్‌తజిబ్ లకుమ్ వ ఇన్నక లా తుఖ్‌లిఫుల్ మీఆద్. వ ఇన్నీ అస్ అలుక కమా హదైతని లిల్ ఇస్‌లామి అన్ లా తన్ జి అహు, మిన్ని హత్తాత వఫ్ఫానీ వ అనా ముస్లిమున్. సుబ్‌హానల్లాహి వల్ హమ్దు లిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలా హవులా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యుల్ అజీమ్.**

**అల్లాహుమ్మ సల్లి వ సల్లిమ్ అలా సయ్యిదినా ముహమ్మదిన్ వ అలా ఆలిహి వ సహ్‌బిహి వ అత్‌బఆఇహి ఇలా యౌమిద్దీన్. అల్లాహుమ్మగ్ ఫిర్‌లి వలివాలిదయ్య వలి మసాఇఖి. వలిల్ ముస్లిమీన అజ్‌మయీన్ వ సలామున్ అలల్ ముర్‌సలీన్. వల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.**

**తర్జుమా:** అల్లాహ్ అందరి కన్నా గొప్పవాడు. అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు. అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు. పొగడ్తలన్నీ అల్లాహ్‌కే తగును. ప్రశంసలన్నీ అల్లాహ్‌కే చెల్లును. ఆయనయే మాకు సన్మార్గాన్ని ప్రబోధించాడు. సన్మార్గం చూపిన ఆ ప్రభువుకే పొగడ్తలన్నీ చెల్లును. ఒక వేళ ఆ సన్మార్గం చూపెట్టకపోతే, మేము మార్గభ్రష్టులమై పోయేవారము. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్య దైవం లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములు లేరు. ఈ విశ్వ సామ్రాజ్యమంతా ఆయనదే. పొగడ్తలన్నీ ఆయనకే చెల్లును. ఆయనయే సృష్టిస్తాడు. మృత్యువును ప్రసాదిస్తాడు. మరియు ఆయనయే తిరిగి బ్రతికిస్తాడు. ఆయనకు మృత్యువు లేదు. మేలు చేసే కార్యాలన్నీ ఆయన ఆధీనంలో ఉన్నాయి. ప్రతి దానిపై ఆయన ఆధిపత్యం ఉన్నది. అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్య దైవం లేడు. ఆయన ఒక్కడే. ఆయన వాగ్దానాలన్నీ సత్యమైనవి. తన దాసునికి (ముహమ్మద్-స) సహాయపడ్డాడు. ఆయన సైన్యాన్ని పైచేయిగా చేసి ధిక్కారులకు గుణపాఠం నేర్పినాడు. ఆయన తప్ప దైవం లేడు. అవిశ్వాసి నీ ఆరాధనను చెడుగా భావించి మండి పడినప్పటికీ మేము నిన్ను తప్ప వేరెవరినీ ఆరాధించలేదు. ఓ ప్రభూ! నీవు నాకు ప్రసాదించిననే ఇస్లామ్ అను శుభ

భాగ్యాన్ని నా నుండి వేరు చేయకుండా, దానిలోనే నాకు మృత్యువును ప్రసాదించు.

**రబ్బనగ్‌ఫిర్‌లి వలివాలిదయ్య వలిల్ మూమినీన యౌమ యకూముల్ హిసాబ్.**

**తర్జుమా:** ఓ ప్రభూ పాపపుణ్యాల గణిపు రోజున నన్ను క్షమించు. నా తల్లిదండ్రులకు, విశ్వాసులందరికి కూడా క్షమాభిక్ష నొసంగు.

**రబ్బిగ్‌ఫిర్ వర్‌హమ్ వ అంతల్ అఅజ్జుల్ అక్‌రమ్.**

**తర్జుమా:** ఓ దేవా! నన్ను మన్నించు, కరుణించు, నిస్సందేహంగా నీవు గొప్ప గౌరవనీయుడు.

**అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ అఫ్‌వ వల్ ఆఫియత ఫిద్దున్‌యా వల్ ఆఖిర.**

**తర్జుమా:** ఓ అల్లాహ్! నన్ను క్షమించు. ఇహపర లోకాలకు రక్షణ ప్రసాదించమని నిన్ను వేడుకొనుచున్నాను.

దైవప్రవక్త హజ్‌రత్ ఇబ్రాహీమ్(అ) సతీమణి అయిన హజ్‌రత్ హాజిరహ్(అ) ఆనాడు సఫా మరియు మర్వహ్ కొండల మధ్య ఉన్న కనుమలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు పరుగెత్తేవారు. ఎందుకంటే కాబాగృహం సమీపంలో ఉన్న ఆవిడ కుమారులయిన హజ్‌రత్ ఇస్మాయీల్(అ) ఆవిడకు కనిపించకుండా కనుమరుగయ్యేవారు. ఆవిడ యొక్క సున్నత్ ఈనాటికీ ఆచరించబడుతోంది. సౌదీ ప్రభుత్వం రెండు ఆకుపచ్చని రంగులో ఉన్న స్తంభాలను, ట్యూబ్‌లైట్లను గుర్తుగా అమర్చింది. వాటిని 'మైలైన్ అఖ్‌జరైన్' అంటారు. వాటి మధ్య పురుషులు కొద్దిగా పరుగెత్తూతూ నడవవలసి ఉంటుంది. మహిళలు తమ సాధారణ వేగంతోనే నడవవలసి ఉంటుంది.

సఫా నుంచి మొదలుపెట్టి మర్వహ్ వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే సఈకు సంబంధించిన ఒక చక్కర్ పూర్తయినట్లవుతుంది. తిరిగి మర్వహ్ నుంచి మొదలు పెట్టి సఫా వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే అది రెండవ సఈకు సంబంధించిన రెండవ చక్కర్ అవుతుంది. ఆ విధంగా మీరు సఈకు సంబంధించిన ఏడు చక్కర్లను పూర్తి చేస్తారు. మీ సఈకు, సఫా నుంచి మొదలు పెట్టి మర్వహ్ వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే సఈకు సంబంధించిన ఒక చక్కర్ పూర్తయినట్లవుతుంది. తిరిగి మర్వహ్ నుంచి మొదలు పెట్టి సఫా వరకు ఒక పర్యాయం నడిచినట్లయితే అది రెండవ సఈకు సంబంధించిన రెండవ చక్కర్ పూర్తి అవుతుంది. ఆ విధంగా మీరు సఈకు సంబంధించిన ఏడు చక్కర్లను పూర్తి చేస్తారు. ఈ సఈకు సంబంధించిన ఏడవ చక్కర్ మర్వహ్ వద్ద ముగుస్తుంది. సఈ చేసేందుకు ఉద్దేశించబడిన ప్రదేశం ఎంతో పరిమితమైనది. అందుకే హజ్‌కు సంబంధించిన ప్రత్యేక దినాలలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. తవ్వాఫ్ కంటే ఎక్కువ సమయం సఈ చేసేందుకు పడుతుంది. కనుక అటువంటి పరిస్థితిలో మస్జిదె హరామ్‌కు చెందిన మొదటి అంతస్తులో లేదా పైకప్పు మీద సఈ చేయడం సులభతరమవుతుంది.

సఈ పూర్తి చేసిన తర్వాత రెండు రకాతులు అల్లాహ్ పట్ల కృతజ్ఞతా భావంతో చదవడం ముస్తహబ్. అయితే ఈ రెండు రకాతుల కృతజ్ఞతాపూర్వక నమాజ్ వాజిబ్ (తప్పనిసరి) కాదు.

రెండు రకాతులు నమాజ్ చదివిన తర్వాత మీరు మర్వహ్ వైపున ఉన్న ద్వారం గుండా బయటికి వెళ్లిపోండి.

మక్కాలోనే నివసించే వారి కొరకు మస్జిదె హరామ్‌లో నఫిల్ నమాజ్ చదవడమనేది ఉత్తమ ఆరాధన. అయితే మక్కాకు దూరంగా నివసించే వారి కొరకు నఫిల్ తవ్వాఫ్ చేయడమనేది నఫిల్ నమాజ్ చదవడం కంటే ఉత్తమమైన ఆరాధన అవుతుంది. ఎందుకంటే నఫిల్ నమాజ్‌ను వారు తమ స్వస్థలానికి వెళ్ళిన తర్వాత కూడా చదవగలరు. కానీ తవ్వాఫ్ చేసే అవకాశం మాత్రం వారికి మరెక్కడా లభించదు. కనుక హజ్ యాత్రికులు మక్కాలో ఉన్నంత కాలం వీలయినన్ని ఎక్కువ సార్లు తవ్వాఫ్ చేసేందుకు ప్రయత్నించాలి. అలాగే అన్ని నమాజులనూ మస్జిదె హరామ్‌లో జమాఅత్‌తో కలిసి చదివేందుకు ప్రయత్నించాలి. మస్జిదె హరామ్‌కు చుట్టుపక్కల ఎన్నో మస్జిద్‌లు ఉన్నాయి. ప్రజలు సౌలభ్యం కొరకు ఆ

మస్జిద్‌లలో తేదా తాము బస చేసిన గదుల్లో జమాఅత్‌ను ఏర్పరుచుకొని నమాజ్ చదువుతూ ఉంటారు. అయితే **ఒక పుణ్యఫలానికి బదులు లక్ష రెట్లు ఎక్కువగా పుణ్యఫలం** మాత్రం మస్జిదె హరామ్‌లో మాత్రమే లభ్యమవుతుంది. చుట్టుపక్కలి మస్జిద్‌లలోనూ మరెక్కడా లభించదు. ఈ విషయాన్ని హజ్ యాత్రికుడు ఎన్నడూ మరువరాదు.

**అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ అఫ్వ వల్ ఆఫియత ఫిద్దున్‌యా వల్ ఆఖిరహ్**

తర్జుమా : " ఓ అల్లాహ్ ! నేను నిన్ను ఇహపరలోకాలలో పాప క్షమాపణ కొరకు మరియు సంక్షేమం కొరకు ప్రార్థిస్తున్నాను "

**రబ్బనా ఆతినా ఫిద్దున్ హసనతవ్ వఫిల్ ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్**

**తర్జుమా:** "ఓ అల్లాహ్! మాకు ఇహలోకంలోనూ మంచి స్థితిని ప్రసాదించు, పరలోకం లోనూ మంచి స్థితిని ప్రసాదించు. అలాగే మమ్మల్ని నరకాగ్ని నుంచి రక్షించు"

ఈ రెండవ దుఆను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) తవాఫ్‌లో (రుక్‌నె యమానీ మరియు హజ్రె అస్వద్‌ల మధ్య) తరచుగా పఠించేవారు.

ఖుర్‌ఆన్‌లోనూ, దైవప్రవక్త(స) గారి ప్రార్థనలలోనూ ఇంకా ఎన్నో చిన్న చిన్న గుర్తుంచుకోదగిన ప్రార్థనలున్నాయి. అవి తవాఫ్ సందర్భంలో మరియు ఇతర సందర్భాలలోనూ చదివేందుకు యోగ్యమైనవి. వాటిని సులభంగా గుర్తుంచుకోగలము. వాటిలో నుంచి కేవలం నాలుగయిదు దుఆలు క్రింద పేర్కొనబడుతున్నాయి:

**"అల్లాహుమ్మ గష్షినీ బిరహ్‌మతిక వ జన్నిబ్‌నీ అజాబక"**

**తర్జుమా :** "ఓ అల్లాహ్ ! నన్ను నీ కారుణ్యంలో కప్పివేయి మరియు నీ శిక్ష నుంచి కాపాడు"

**"యా హయ్యు యా ఖయ్యూము బి రహ్మతిక అస్తగీస్"**

**తర్జుమా:** " ఓ నిత్యసజీవుడా ! అందరినీ నిలిపియుంచే వాడా ! నేను నీ కారుణ్యం ద్వారా సహాయాన్ని అర్థిస్తున్నాను"

**"లా ఇలాహ ఇల్లా అన్‌త సుబ్‌హానక ఇన్నీ కున్‌తు మినజ్జాలిమీన్"**

**తర్జుమా:** "ఓ అల్లాహ్ ! నీవు తప్ప ఆరాధ్యుడెవరూ లేరు. నీవు పరిశుద్ధుడివి. నేనే దుర్మార్గులలో, అపరాధులలో ఒకడిని "

**"రబ్బిగ్ ఫిర్ వర్‌హమ్ వ అన్‌త ఖైరుర్రాహిమీన్"**

**తర్జుమా:** "ఓ ప్రభూ ! మన్నించు మరియు కరుణించు. నీవు అందరికంటే అధికంగా కరుణించేవాడివి"

**"అల్లాహుమ్మఫ్‌తహ్‌లీ అబ్‌వాబ రహ్‌మతిక"**

**తర్జుమా:** "ఓ అల్లాహ్ ! మా కొరకు నీ కారుణ్యపు ద్వారాలను తెరచివేయి"

అల్లాహ్‌కు చెందిన ఏ దాసులయితే ఎక్కువగా చదువుకోలేదో వారి కొరకు పైన పేర్కొనబడిన దుఆలు చాలు. వారు ఇటువంటి చిన్న చిన్న దుఆలను వాటి అర్థంతో సహా గుర్తుంచుకోవాలి మరియు తవాఫ్ చేసే సందర్భంలో వాటినే చదవాలి. అయితే అది కూడా తప్పనిసరి అయితే కాదు. కనుక ఒకవేళ తవాఫ్ చేసే సందర్భంలో కేవలం "సుబ్‌హానల్లాహ్", 'అల్‌హమ్‌దు లిల్లాహ్', 'లా ఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్' లేదా 'దురూదె షరీఫ్' పఠించినా సరిపోతుంది.

మీరు సఈ చేసేందుకై మస్జిదె హరామ్ నుంచి బయలుదేరినప్పుడు ఈ దుఆను పఠిస్తే ఎంతో మంచిది:

**"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీకలహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్‌దు వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్"**

**తర్జుమా:** "అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే, ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. ఆయనే స్తోత్రానికి అర్హుడు. అన్నింటిపై ఆయనే అధికారం గలవాడు"

సఈ చేసే సమయంలో దైవప్రవక్త(స) చే పఠించబడిన ఒక దుఆ ఉన్నది. మీరు దానిని గుర్తుంచుకొని పఠించండి. అందులోని పదాలు ఎంతో ప్రియమైనవి:

**"రబ్బిగ్ ఫిర్ వర్‌హమ్ ఇన్నక అన్‌తల్ అజీజుల్ అక్‌రమ్"**

**తర్జుమా:** "ఓ నా ప్రభూ ! మన్నించు మరియు కరుణించు. నీవు మహా ప్రాబల్యం గల శక్తిమంతుడివి మరియు ఎంతగానో దయ చూపేవాడివి "

**జిల్ హిజ్జా 8వ తేదీన హజ్ కొరకు సంకల్పం**

"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుల్ హజ్ ఫయస్సిర్‌హులీ వతఖబ్బల్‌హా మిన్నీ"

**తర్జుమా:** ఓ! అల్లాహ్! నేను హజ్ కొరకు సంకల్పం చేయుచున్నాను. ఈ కార్యాన్ని నాకు సరళతరం చేయి. దీన్ని స్వీకరించు."

**తల్‌బియా :** లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లా షరీక లక లబ్బైక్ ఇన్నల్ హమ్‌ద వన్నిమత లక వల్ ముల్క్ లా షరీక లక

**జిల్ హిజ్జా 9వ తేదీన**

సూర్యుడు ఉదయించాక, మీనా నుంచి అరఫా వైపుకు వెళ్ళాలి. అరఫా వైపు వెళుతూ తక్బీర్ (అల్లాహు అక్బర్), తహ్లీల్ (లా ఇలాహ ఇల్లల్లాహ్) మరియు తల్బియా చదవాలి. అక్కడ జుహర్ సమయంలో- జుహర్, అసర్ రెండు నమాజులను కలిపి రెండు రెండు రకాతులు చదవాలి. అల్లాహ్ ను స్తుతిస్తూ, ఖిబ్లా వైపు ముఖం చేసి ఎక్కువగా దుఆ చేస్తూ గడపాలి.

అరఫాత్‌లో అల్లాహ్‌ను స్మరించడానికి ఈ దుఆ అత్యధికంగా పఠించండి

**"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్‌కు వలహుల్ హమ్‌దు వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్"**

**తర్జుమా:** " అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వామి ఎవరూ లేరు. రాజ్యాధికారం ఆయనదే. స్తోత్రం ఆయన కొరకే. ఆయన ప్రతి వస్తువుపై అధికారం గలవాడు"

దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "అరఫాత్ నాడు నా యొక్క మరియు నా కంటే పూర్వపు దైవప్రవక్తల యొక్క ప్రత్యేకమైన పిలుపు ఈ వచనమే" అరఫా రోజు ఖిబ్లా వైపు ముఖం చేసి చేతులెత్తి దుఆ చేస్తూ, తల్బియా చదువుతూ ఉండాలి.

**'లా ఇలాహ ఇల్లల్లాహ్'** ఎక్కువగా చదవాలి. అరఫా రోజున ఇది మంచి దుఆ. దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం దీని గురించి ఇలా అన్నారు: అరఫా రోజున సాయంత్రం నేను మరియు ఇతర ప్రవక్తలు పలికిన ఉత్తమ పదాలు **లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు లాషరీక లహు లహుల్ ముల్కు వ లహుల్ హందు వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్.**

తల్బియాలో అప్పుడప్పుడు ఇది (**ఇన్నమల్ ఖైరు ఖైరుల్ ఆఖిరతి** అన్నిటిలో మంచిది పరలోకంలోని మంచిది) కూడా జోడిస్తే ధర్మసమ్మతమే.

"అల్లాహ్ అరఫాలో ఉన్న తన దాసుల గురించి దైవదూతలతో ఇలా అంటాడు: 'నా దాసులను చూడండి. వారు నా దగ్గరకు చిందర వందరగా, దుమ్ము ధూళితో వచ్చారు.'"

అల్లాహ్‌ను స్మరిస్తూ, దుఆ చేస్తూ గడపాలి. అరఫా నాటి ఆఖరి ఘడియలలో ఎక్కువగా దుఆ చేయాలి. దుఆలలో అన్నిటికంటే ఉత్తమమైనది అరఫా రోజు చేసే దుఆ.

జుహర్ సమయంలో ఇమామె హజ్ (ఖుత్బా) ప్రసంగం వినాలి. ఆ తరువాత జుహర్, అసర్ నమాజులు కలిపి ఒక అజాన్ మరియు రెండు ఇఖామాలతో చదవాలి. ఈ నమాజ్ సామూహికంగా చదవాలి. దీన్ని ఖసర్ చేయాలి (రెండు రకాతులు)అని అంటారు. (సహీహ్ ముస్లిం)

జుహర్ మరియు అసర్ నమాజ్ చదివాక, ఎక్కడ చోటు దొరికితే అక్కడ (వఖూఫ్) నిలబడి, చేతులు పైకెత్తి ఖుర్ఆన్ లోని దుఆలు లేదా దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం చదివిన దుఆలు చేస్తూ, మధ్య మధ్యలో తక్బీర్, తహ్లీల్ మరియు తల్బియా కూడా పలకాలి. (సహీహ్ ముస్లిం). ఆ రోజు ఈ దుఆ చేయండి: **లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు లా షరీక లహు లహుల్ ముల్కు వ లహుల్ హందు వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్.** (తిర్మిజి). ఇది దైవప్రవక్త సల్లల్లాహు అలైహివ సల్లం సున్నత్ (ఆచారం) మరియు ఈ దుఆ ధృవీకరించబడినది.

సూర్యాస్తమయం తరువాత మగ్రిబ్ నమాజ్ చదువకుండా ముజ్దలిఫాకు బయలు దేరండి. తల్బియా చదువుతూ మెల్లిగా, హుందాగా వెళ్ళండి. (సహీహ్ ముస్లిం).

**ముజ్దలిఫా చేరుకొని మగ్రిబ్, ఇషా నమాజ్‌లను ఖసర్ చేసి**

చదవాలి.

నమాజ్ తరువాత శనగ గింజలంత పరిమాణం గల 70 కంకరరాళ్ళను ఏరుకోండి. ఈ రాత్రి అల్లాహ్ జిక్ర్‌లో గడపాలి. ఫజర్ నమాజ్‌ను ముజ్దలిఫాలోనే చేయాలి. ఆ తరువాత తల్బియాను పఠిస్తూ మీనా వైపు ప్రయాణం.

షైతాన్‌పై రాళ్ళు రువ్వడం కోసం ముఖం ఖిబ్లా వైపు పెట్టి నిలబడాలి. కుడిచేయి బొటనవ్రేలు, చూపుడు వేలు మధ్య ఒక్కొక్క కంకరరాయిని పట్టుకొని

**బిస్మిల్లాహి అల్లాహు అక్బర్ రగ్మన్ లిష్షైయాతిని వరిజన్ లిరహ్మాని.**

**అల్లాహుమ్మజ్అల్‌హు హజ్జామ్మబ్రూరన్ వ జంబన్ మగ్‌ఫూరన్ వ సఅయమ్ మష్‌కూరా** పఠిస్తూ షైతాన్‌పై రాళ్ళు రువ్వాలి.

**తష్రీక్ రోజులు:** జిల్‌హజ్ తొమ్మిదో తేదీ నుంచి పద మూడో తేదీ వరకు ఐదు రోజులను తష్రీక్ రోజులంటారు. ఈ ఐదు రోజుల్లో తక్బీరె తష్రీక్‌లు పఠిస్తారు. అందుకనే ఈ ఐదు రోజులను 'అయ్యామె తష్రీక్' అంటారు. ఫర్జ్ నమాజ్ తర్వాత "అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్''.

**తహల్లుల్ అంటే:** హాజీ ఇహ్రామ్ ధరించి ఉన్నప్పుడు అతనిపై కొన్ని వస్తువులు నిషేధం అవుతాయి. హాజీ తల గొరిగించుకున్న తర్వాత సంభోగించడం, వేటాడం తప్ప అన్నీ ధర్మసమ్మతమవుతాయి. సమ్మతమయ్యే ప్రక్రియను తహల్లుల్ అంటారు.

**హాజీ రెండో తహల్లుల్ ఎప్పుడు పొందుతాడు:** తవాఫే జియారత్ చేసిన తర్వాత. హాజీ భార్యతో సంభోగించడం, వేటాడటం ధర్మసమ్మతమవడాన్ని రెండో తహల్లుల్ అంటారు.

**దమ్ అంటే:** హజ్ ప్రక్రియలో జరిగిన తప్పిదాల వల్ల పరిహారంగా ఇచ్చే ఖుర్బానీని దమ్మె కప్ఫారా' అంటారు. పరిహారంగా ఒక మేక, గొర్రె, పొట్టేలు, ఒంటె, ఆవు ఖుర్బానీ ఇవ్వాలి.

**సద్‌ఖా ఎప్పుడు తప్పనిసరి:** వజూ లేకుండా తవాఫె చేసినప్పుడు, తవాఫ్‌లో కానీ, సయీలో కాని కొన్ని ప్రదక్షిణలను విడిచిపెట్టినప్పుడు. షైతాన్‌పై రాళ్ళు ఏడు రాళ్ళ కంటే తక్కువ కొట్టినప్పుడు సద్‌ఖా చెల్లించాలి.

మదీనా వైపుకు పయనం

**"'బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్"**

**తర్జుమా:** అల్లాహ్ పేరుతో ప్రవేశిస్తున్నాను. అలాగే దైవ ప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స)పై దరూద్ మరియు సలామ్ పంపుతున్నాను''. ఆ తర్వాత మీ కుడికాలిని మస్జిదె హరామ్‌లోకి ప్రవేశపెడుతూ క్రింది దుఆను పఠించండి.

మస్జిదె నబవీ ద్వారం వద్దకు చేరుకొని 'బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్' అని పలికి మొదట కుడి కాలిని లోపల పెట్టండి. ఆ తర్వాత ఎడమకాలిని పెట్టండి మరియు అల్లాహ్‌ను ఈ క్రిందివిధంగా ప్రార్థించండి:

**"అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ జునూబీ వఫ్‌తహ్ లీ అబ్‌వాబ రహ్మతిక్"**

మస్జిద్‌లోకి ప్రవేశించి అన్నింటికంటే ముందు 'రౌజతుల్ జన్నహ్' గా ' స్వర్గలోకపు ఉద్యానవనం' గా పిలువబడే స్థలం వద్దకు చేరుకోండి. అక్కడ రెండు రకాతులు 'తహియ్యతల్ మస్జిద్ ' నమాజ్ చదవండి. సలామ్ పలికిన తర్వాత అల్లాహ్ తన ప్రత్యేక అనుగ్రహంతో అక్కడ హాజరవడానికి సంబంధించిన సౌభాగ్యాన్ని, సద్బుద్ధిని ప్రసాదించినందుకు గాను అల్లాహ్‌కు ఎంతగానో కృతజ్ఞతలు తెలుపుకోవాలి మరియు క్రిందివిధంగా ప్రార్థించాలి :

''ఓ అల్లాహ్ ! ఏవిధంగానయితే నీవు కేవలం నీ అనుగ్రహంతో ఇక్కడ హాజరయ్యే సౌభాగ్యాన్ని ప్రసాదించావో అదేవిధంగా నీ ప్రసన్నతను మరియు పరలోకంలో స్వర్గాన్ని ప్రసాదించు. అలాగే దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స)ను నాకొరకు సిఫారసు చేసే వారిగా చేయి మరియు నా విషయంలో ఆయన(స) సిఫారసును అంగీకరించు''

ఆ తర్వాత దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) యొక్క పవిత్ర సన్నిధిలో హాజరయి ఆయన (స) స్వయంగా మీ సలామ్‌ను వింటారని భావిస్తూ సలామ్ పలకండి.

**"అస్సలాము అలైక యా రసూలల్లాహ్. అస్సలాము అలైక యా హబీబల్లాహ్. అస్సలాము అలైక యా షఫీఅల్ ముజ్‌నిబీన్ . అస్సలాము అలైక యా ఖాతమన్నబియ్యీన్. అస్సలాము అలైక వ అలా ఆలిక వ అస్‌హాబిక అజ్‌మఈన్. అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్‌మతుల్లాహి వ బరకాతుహూ"**

**తర్జుమా :** " ఓ దైవప్రవక్తా (స) ! మీ పై సలామ్ (శుభం). ఓ అల్లాహ్‌కు ప్రియమైన ప్రవక్తా (స)! మీ పై సలామ్. ఓ పాపాత్ముల కొరకు సిఫారసు చేసే ప్రవక్తా (స)! మీ పై సలామ్. ఓ దైవప్రవక్తల పరంపరను ముగించిన ఆఖరి ప్రవక్తా (స)! మీ పై సలామ్! మీ పై, మీ సమస్త సంతతిపై, మీ సహచరులపై (రజి) సలామ్. ఓ దైవప్రవక్తా (స)! మీ పై శుభం వర్షించుగాక. అలాగే అల్లాహ్ యొక్క కారుణ్యం మరియు శుభాలు వర్షించుగాక ! "

మదీనా నుంచి ఏ రోజయితే నిష్క్రమించాలని సంకల్పించుకున్నారో అప్పుడు ప్రయాణ సామగ్రిని సర్దుకొని, ప్రయాణం కొరకు పూర్తిగా సన్నద్ధులయి చివరి పర్యాయం మస్జిదె నబవీలోకి ప్రవేశించండి. ముందుగా రెండు రకాతులు 'రౌజతుల్ జన్నహ్' అనే ప్రదేశంలో చదవండి. సలామ్ పలికిన తర్వాత ముందుగా హజ్ మరియు మదీనా సందర్శన భాగ్యాన్ని ప్రసాదించినందుకు గాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోండి

దుఆ చేసిన తర్వాత దురూద్ మరియు సలామ్ పఠిస్తూ దైవప్రవక్త (స) పవిత్ర సమాధి వద్దకు చేరుకొని ఇంతకుముందు పేర్కొన్న రీతిలో సలామ్ పలకండి.

**"అల్లాహుమ్మ సల్లి అలా సయ్యిదినా ముహమ్మది నిన్నబియ్యిల్ ఉమ్మి వ అలా ఆలిహీ వ అస్‌హాబిహీ వ బారిక్ వసల్లిమ్ కమా తుహిబ్బు వ తర్‌జా అదద మా తుహిబ్బు వ తర్‌జా"**

**"అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు వస్సలాము అలైక అయ్యుహ న్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలాఇబాదిల్లా హిస్సాలిహీన్, అష్ హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్ హదు అన్న ముహమ్మదన్ అబ్ దుహు వ రసూలుహు"**

**తర్జుమా:** స్తుతి, శారీరక, ఆర్థిక పరమైన ఆరాధనలన్నియూ అల్లాహ్ కొరకే, ఓ ప్రవక్తా! మీపై అల్లాహ్ కరుణా కటాక్షాలు మరియు శుభాలు కురియుగాక, అల్లాహ్ శుభాలు మాపై మరియు పుణ్యాత్ములైన అల్లాహ్ దాసులపై కురియుగాక, నేను సాక్ష్యమిస్తున్నాను వాస్తవమైన ఆరాధ్యుడు ఎవడు లేడు, కేవలం ఒక్క అల్లాహ్ తప్ప మరియు సాక్ష్యమిస్తున్నాను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ దాసుడు మరియు ఆయన సందేశహరుడు అని.

***10 మంది సహాబీలకు జన్నత్ శుభవార్త లభించింది. హజరత్ అబుబకర్ (ర), హజరత్ ఉమర్(ర), హజరత్ ఉస్మాన్(ర), హజరత్ అలీ (ర), హజరత్ జుబేర్(ర), హజరత్ తల్హా(ర), హజరత్ అబ్దుల్ రహమానన్ బిన్ అవుఫ్(ర), అబూ ఉబేదా బిన్ జర్హా(ర), సాద్‌బిన్ అబి వఖాస్(ర), సయీద్ బిన్ జైద్(ర),***

# షబే మేరాజ్ సందేశం...

- డా.ఫజులుల్లా ఖాన్

''తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా వరకు తీసుకు పోయిన అల్లాహ్ పరిశు ద్ధుడు. దాని పరి సరాలను మేము శుభవంతం చేశాము. మేమతనికి మా (శక్తికి సంబంధించిన) కొన్ని సూచనలను చూప దలచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, బాగా చూసేవాడు''. (బనీ ఇస్రాయీల్: 1)

అనాథ అయిన తనను తన సంతానం కన్నా అధికంగా చూసుకున్న బాబాయి అబూ తాలిబ్ గారి మరణం. ఆయన బ్రతికున్నంత కాలం ప్రవక్త(స) వారికి వెన్నుదన్నుగా నిలచి, ఆపద సమయంలో ఆయనకు కొండంత అండనిచ్చారు. ఆయన మరణంతో మక్కా అవిశ్వాసులు చెలరేగిపోయారు. ప్రవక్త(స) వారిని చిత్రహింసలకు గురి చేయడమేకాక, ఆయన ఇద్దరు కూతుళ్ళను విడాకులిప్పించి ఆయన్ను మానసికంగా సయితం దెబ్బ తీయాడానికి కుయుక్తులు పన్నారు. ఇది జరిగిన కొన్నాళ్ళకే సతీమణి హజ్రత్ ఖదీజా(ర) గారు కూడా మరణించారు. ధర్మప్రచార మార్గంలో బయట అయ్యే గాయాలకు మందులా పని చేసిన మహిళామూర్తి ఆమె. సత్యబాంధవి అయిన ఆమె ప్రవక్త(స) వారిని ఎన్నో విధాలుగా ఆదుకున్నారు. అలాంటి ప్రియధర్మచారిణి మరణంతో ఇటు ఇంటా అటు బయట ఒంటరి అయ్యారు ప్రవక్త(స). ఈ రెండు మరణాలు ఒకటి తర్వాత ఒకటి చోటు చేసుకోవడం వల్ల ప్రవక్త(స) తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అదే సమయంలో తాయిఫ్ ప్రయాణం మిగిల్చిన చేదు అనుభవం కూడా మరింతగా ఆయన్ను కలచి వేసింది.

'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను నమ్మండి అరబ్బు, అరబ్బేతర ప్రాంతాలు మీ పాదాక్రాంతం అవుతాయి అని ప్రజల్ని ధర్మమార్గం వైపునకు ఆహ్వానించే ఆయన్ను మక్కాలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. ఒక అవిశ్వాసి రక్షణలో మక్కాలో ప్రవేశించాల్సిన గడ్డు స్థితి. అలాంటి తరుణంలో అన్నింటి నిశితంగా పరిశీలిస్తున్న, వింటున్న అల్లాహ్ ఆయన కోసం గగన విహారం ఏర్పాటు చేశాడు.

**మేరాజ్ కానుకలు:**

ఇస్రా-మేరాజ్ సందర్భంగా ఆయనకు లభించిన కానుకలు

1) ఐదు పూటల నమాజు.

2) సూరయె బఖరహ్‌లోని చివరి ఆయతులు.

3) సత్సంకల్పానికే పుణ్యం-అది కార్య రూపం దాల్చక పోయినా.. దుస్సంకల్పానికి దండన లేదు అది కార్య రూపం దాల్చనంత వరకు).

**విన్న గాథలు:**

1) దైవదూతల నాయకులయిన జిబ్రీల్(అ) వారి నోట మాషితహ్ బిన్త్ ఫిర్‌ఔన్ (ఫిర్‌ఔన్ కూతురి వెంట్రుకలు సవరించే స్త్రీ) గాథ. 2) హజ్రత్ బిలాల్ (ర) వారి గాథ.

**చూసిన దృశ్యాలు:**

1) బైతుల్ మామూర్

2) సిద్రతుల్ మున్‌తహా

3) స్వర్గ నరకాల దర్శనం. కొందరు దుష్టులకు లభించే దండన, కొందరు ధర్మాత్ములకు లభించే ప్రతిఫలం.

**కలుసుకున్న వ్యక్తులు:**

1) ప్రవక్తలు మస్జిదె అఖ్సాలో.

2) ఏడు ఆకాశాల మీద ఎనిమిది మంది ప్రవక్తలు. ప్రవక్త ఆదమ్, ఈసా, యహ్యా, యూసుఫ్, ఇద్రీస్, హారూన్, మూసా, ఇబ్రాహీమ్ (అ).

3) దైవ దూత జిబ్రీల్‌తోపాటు ఇతర దైవ దూతలు.

### సంభాషించిన వారు:

1) దైవ దూతలు

2) దైవ ప్రవక్తలు

3) అల్లాహ్.

### మేరాజ్ మొదటి పాఠం-సుబ్హానల్లాహ్:

ఇస్రా గురించి ప్రస్తావిస్తూ అల్లాహ్ మొదట 'సుబ్హానల్లజీ' అన్నాడు. అల్లాహ్ పవిత్రుడు, పరిశుద్ధుడు అన్నది దీనర్థం. పవిత్రతకు, పరిశుద్ధతకు మూలం అల్లాహ్. మనిషి చేసే లోప సహిత ఊహాగానాలకు, కల్పించే బూటకపు భాగస్వామ్యాలకు, ఆయనకు భార్య పిల్లలు ఉన్నారన్న అపవాదుకి, ఆయన మానవాకారంలో అవతరిస్తాడన్న అపప్రదకు ఆయన అతీతుడు, పరమ పవిత్రుడు. అలాగే ఇస్రా మేరాజ్-ఈ మహత్తర సంఘటన జరిపించడంలో ఆయనకెవ్వరితో నూ పోలికలు లేవు. ఆయనకు ఆయనే సాటి.

లక్షన్నర కిలోమీర్ల దూరంలో ఉన్న చందమామ వెన్నలను మన వరకు అర సెకనులో చేరవేసే అల్లాహ్ సుబ్హాహు వ తఆలాకు రాత్రి ఒక భాగంలో ప్రవక్త(స) వారిని మస్జిదె హారమ్ నుండి మస్జిదె అఖ్సా వరకు, మస్జిదె అఖ్సా నుండి ఏడు ఆకాశాల వరకు తీసుకెళ్ళి మళ్ళీ తీసుకు రావడం ఏమంత కష్టం కాదు. సాధ్య, అసాధ్యాలు మనిషికేగానీ అల్లాహ్‌కు కావు. వెలుగు చీకట్లు, జయా పజయాలు అల్లాహ్‌కు సమానం. ''(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు-వారు చెబుతున్నట్లుగా అల్లాహ్‌తో పాటు వేరే ఆరాధ్యదైవాలు గనక ఉండి ఉంటే వారు ఇప్పటికే సింహాసనాధీశుని వైపునకు వెళ్లే మార్గాన్ని అన్వేషించేవారే. ఆయన పరిశుద్ధుడు. వారు అనే మాటలకు అతీతుడు, మహోన్నతుడు''. (బనీ ఇస్రాయీల్: 42,43)

నిజంగా చెప్పాలంటే 'అల్లాహ్ ఒక్కడే నిజ ఆరాధ్యుడు' అన్న సాక్ష్యాన్ని సృష్టిలోని అణువణువు ఇస్తుంది. ఆయన్ను తన పద్ధతి ప్రకారం స్తుతిస్తుంది. కాకపోతే మనకు వాటి స్తోత్రగానం అర్థం కాకపోవచ్చు. ''మేము పర్వతాలను దావూద్(అ)కు స్వాధీన పర్చాము. అవి సాయంత్రం, ఉదయం అతనితోపాటు దైవస్తోత్రం చేసేవి''. (స్వాద్: 18) ఒక మాటలో చెప్పాలంటే, ''అల్లాహ్ స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనయాడని వస్తువంటూ ఏదీ లేదు''. (బనీ ఇస్రాయీల్: 44)

మరి మనం ఏం చెయ్యాలి? ''ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఉదయం సాయత్రం ఆయన పవిత్రతను కొని యాడండి''. (అహ్జాబ్: 41,42) అన్న అల్లాహ్ ఆదేశాన్ని అనుసరించి ఉదయం సాయంత్రాలు వేళ విశేషాన్ని బట్టి ప్రవక్త(స) మనకు నేర్పిన దుఆలు, ప్రార్థనలు చేస్తూ నిరంతరం మన నాలుక అల్లాహ్ నామ స్మరణతో నానుతూ ఉండేలా చూసుకోవాలి.

### దాస్య ఔన్నత్యం:

